క్లుప్తంగా

ఘనంగా కర్రెప్పతాత రథోత్సవం



కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో ఆదివారం కర్రెప్ప తాత ఉత్సవాలు ఘనంగా చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి వసతి కల్పించాలి



ధన్వాడ: మండలంలోని మందిపల్లి గ్రామ గేట్ వద్ద ఉన్న బాలమ్మ దేవాలయం వద్ద తాగునీటికి భక్తులు అల్లాడుతున్నారని సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం భక్తులు నీటి కోసం చుట్టు పక్కల ఉన్న పొలాల్లోకి వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. దేవాలయం వద్ద ట్యాంకుకు మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వడంతో పాటు బోరు రిపేరు చేయించాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, భవన్న, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్ గ్రామంలో ఆదివారం వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. స్నేహభావాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత్, వెంకటప్ప, గ్రామ ఆర్మీ క్రీడాకారులు ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు.

గోమాత కల్యాణం.. లోక కల్యాణం



ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ అంభత్రయ క్షేత్రంలో లోక కల్యాణం కోసం గోమాత కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదిత్య పరాశ్రీస్వామి అన్నారు. ఆదివారం ఆశ్రమంలో ఉగాది ఉత్సవాల అనంతరం గోకల్యాణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్4న గోకల్యాణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోవు ముక్కోటి దేవతలకు ప్రతిరూపమని గోవు సంతతి పెరిగితే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రాజు, కురుమూర్తి, నర్సింహ, రమేష్‌గౌడ్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సింగంపేటలో తాగునీటి ఇబ్బందులు



అమరచింత: మండలంలోని సింగంపేటలో మూడు రోజుల నుంచి తాగునీటి ఇబ్బందులు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నీరులేక దిష్టిబొమ్మలుగా దర్శన మిస్తున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నిత్యం కుళాయిల ద్వారా ఇంటింటికి తాగునీరు అందించే వారని ప్రస్తుతం కుళాయిలకు నీటి సరఫరా నిలిచిందని పేర్కొన్నారు. ఎర్రగట్టు వద్ద పైప్‌లైన్ లీకేజీ వల్ల తా గునీరు రావడం లేదని మిషన్ భగీరథ సిబ్బంది పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారు లు స్పందించి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మద్దెల్‌బీడ్ రామాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న బస్సప్ప



ఊట్కూరులో ఉగాది ఉత్సవాల్లో మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు



బైరంకొండలో పంచాంగ శ్రవణం



మరికల్‌లో ఉగాది పంచాంగం చెబుతున్న బ్రాహ్మణులు

ఘనంగా ఉగాది వేడుకలు



మక్తల్ మల్లికార్జునస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమంలో తిప్పయ్యస్వామి



మక్తల్ పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో పంచాగ శ్రవణం చెబుతున్న వేదపండితుడు ప్రాణేష్‌చారి

సాక్షి నెట్‌వర్క్: ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఉగాది సంబురాలు అంబరాన్నంటాయి. తెల్లవారు జామునుంచే ఆలయాలు కిటకిటలాడాయి. ఉగాది సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాగ శ్రవణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని స్వీకరించి నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలికారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతన్నలు పనులకు శ్రీకారం చుట్టారు. పొల్లాలో దుక్కులు దున్ని సందడి చేశారు. తెలుగు సంవత్సర మొదటి రోజు వ్యవసాయ పనిముట్లకు, ఎద్దులకు, పుడమి తల్లికి పూజలు చేశారు. ఉగాది నాడు భూమికి, ఎద్దులకు, వ్యవసాయ పరికరాలకు పూజలు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నది నమ్మకంగా రైతులు భావిస్తారు. అదే విధంగా పలు దేవాలయాల్లో పురోహితులు విద్యావంతులు పంచాంగ పఠనం నిర్వహించారు. సంవత్సరాంతం వర్షాలు, పంటల సాగు, రాశిఫలాలు వంటి భవిష్య వివరాలతో ప్రజలకు వివరించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక వంటకాలతో తయారు చేసిన నైవేద్యాలు సమర్పించడం రైతులకు ఆనవాయితీగా వస్తోంది.



చర్లపల్లిలో మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్



మద్దూరు కొట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం



నారాయణపేటలో ఉగాది ఉత్సవంలో ప్రసంగిస్తున్న ఆర్ఎస్ఎస్ ముఖ్యవక్త చంద్రశేఖర్



మాగనూర్‌లో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



కున్సిలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న గ్రామస్తులు



యంనోనిపల్లిలో పంచాంగ శ్రవణం చేస్తున్న పూజారి

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి

మరికల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ ప్రారంభించారు. వేసవిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా సంత బజార్‌లో గ్రామ పంచాయితీ సిబ్బంది చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రమేష్, రవి, రామకృష్ణ, బాలస్వామి, రాములు, వెంకట్రామారెడ్డి, తిరుపతయ్య, రవి, శివ, నర్సిములు, రాజు, బాల్‌రాజ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

దాహం తీర్చే అంబలి కేంద్రం

నర్వ: వేసవి తాపాన్ని తీర్చేందుకు అంబలి కేంద్రం ఎంతో ఉపయోగ పడుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కల్వాల్ గ్రామంలో వడ్డేమాన్ ప్రతాప్‌రెడ్డి, భాగ్యమ్మ జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, నర్సిములు, అంజప్ప, గోపి, రాముగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.



మరికల్ బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సన్‌గౌడ్

ఫౌండేషన్ సేవలు విస్తృతం చేస్తాం

నారాయణపేట: భీష్మరాజ్ ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేస్తామని, జిల్లాలో విద్యా, వైద్య, ఆధ్యాత్మిక సేవలే లక్ష్యంగా పనిచేస్తామని ఫౌండేషన్ చైర్మన్ డా.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా బృందంతో ముఖాముఖి నిర్వహించారు. సేవే లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. ఇందులో ఎలాంటి రాజయకీయ ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు సమైక్యతకు ప్రతీక

దామరగిద్ద: ఉత్సవాలు గ్రామైక్యతకు, భక్తికి ప్రతీకగా నిలుస్తాయని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అన్నసాగర్ గ్రామంలో నిర్వహించిన పోతురాజు జాతరలో ఆయన పాల్గొన్నారు. ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. అంతకుముందు రాజ్‌కుమార్‌రెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

పంటలు ఎండుతున్నా పట్టింపు లేదు!



నీరు లేక బీటలు వారిన వరి పంట

- చివరి ఆయకట్టుకు చేరని నీరు
- పారని సంగంబండ ప్రాజెక్ట్ కాల్వ
- వందల ఎకరాల్లో వరి పంట నష్టం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మాగనూర్: సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద వరి పంటలు ఎండుతున్నాయి. యాసంగి పంటలకు పెట్టిన పెట్టుబడి అయినా చేతికి వస్తుందో రాదోనన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. కళ్లెదుటే పంటలు ఎండుతుంటే చివరి ఆయకట్టు రైతులు దిగాలుగా చూస్తున్నారు. యాసంగికి ఉండే ఇబ్బందులను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారని మండల పరిధిలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా సాగులోకి వస్తున్న పంటలకు సరిపడా నీటిని విడుదల చేయడంలో నిర్లక్ష్యం చివరి ఆయకట్టు రైతులకు శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో నీరు ఉన్నా వాటిని రైతులకు సరఫరా చేయడంలో ఇరిగేషనన్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపిస్తున్నారు.

20 రోజులుగా నిలిచిన సరఫరా..

మాగనూర్ మండలంతో పాటు కృష్ణ మండలాలకు సంబంధించిన అనేక గ్రామాల రైతులు వరి పంట ఎండుముఖం పడుతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. సంగంబండ కుడి హైలెవల్ కెనాల్‌కు డ్యాం నుంచి 20 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. తద్వారా కుడి హైలెవల్ కెనాల్ కింద చివరి ఆయకట్టుకు సాగునీరు నిలిచిపోయింది. ముఖ్యంగా మాగనూర్ మండల పరిధిలోని నేరడగం, నేరడగందొడ్డి, తళంకేరి, కొత్తపల్లి, నల్లగట్టు తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా ఎండుముఖం పట్టాయి.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం..

సంగంబండ ప్రాజెక్ట్ కుడి హైలెవల్ కెనాల్ ద్వారా సాగుచేస్తున్న రైతుల పొలాలను రక్షించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన ఫలితం మాత్రం శూన్యం అంటున్నారు. గతంలో కూడా ఇలాగే యాసంగిలో పంటలు ఎండిపోయే దుస్థితి ఏర్పడితే మోటర్ల ద్వారా నీటిని కాలువలకు ఎత్తిపోసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించారని రైతులు చెబుతున్నారు. అయితే ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందని అయితే అధికారులు ఆవైపుగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎండిన పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాల్వలో నీరు లేక బయటకు తేలిన బోర్లు



సంగంబండ రిజర్వాయర్‌లో కాల్వలకు అందని నీరు

చేతికొస్తుందో రాదో..



నాకున్న నాలుగు ఎకరాల పొలంలో రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న వరి పంట పొట్ట దశకు వచ్చింది. గత 20 రోజులుగా కుడి హైలెవల్ కెనాల్‌కు నీళ్లు రావడం లేదు. దీంతో పంట మొత్తం బీటలు వారింది. పంట చేతికి వస్తుందో రాదో అని ఆందోళన ఉన్నాం.

– బస్వరాజు నేరడగందొడ్డి రైతు

కాల్వను నమ్ముకుని పంటలు వేశాం



నాకున్న రెండు ఎకరాల్లో కుడి హైలెవల్ కెనాల్‌ను నమ్ముకుని పంటలు సాగుచేస్తున్నాం. అయితే కాలువలో నీళ్లు లేక కళ్ల ముందే పంటలు ఎండుతున్నాయి. కాలువల పరిస్థితి తెలిసి కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– అంజప్ప రైతు తళంకేరి

ఆరుతడి పంటలపై శ్రద్ధ చూపాలి



గతంలో మాగనూర్ మండల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయి. ఈ విషయం గమనించి రైతులకు ముందుగానే దాదాపు 3వేల ఎకరాల వరకు ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించాం. రైతులు అవేవి పట్టించుకోకుండా వరిసాగు వైపే మొగ్గు చూపారు. దీంతో పూర్తి స్థాయిలో నీరు అందించడానికి అవకాశం లేకుండా పోయింది.

– సతీష్ ఇరిగేషన్ డీఈఈ

అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఇఫ్తార్ విందులో నాయకులు, అధికారులు

మద్దూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు మండల ముస్లింలకు పట్టణంలోని అల్ జుబేదా మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోస్గి ఏఎంసీ చైర్మన్ ముద్ది భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని వారు అనినారు. కార్యక్రమంలో ఆర్ఐ అమరేందర్, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, హుసేన్, సద్దాం, ఇక్బాల్, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, బాబుస్వామి, చంద్రమోహన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 5న నిర్వహించనున్న గ్రామ పంచాయతీ కార్మికుల రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల పనులు కార్మికులతో చేయిస్తూ కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని విమర్శించారు. శ్రమ దోపిడీకి చరమగీతం పాడి, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, రాము, వెంకటయ్య, గోవింద్, ఆనంద్, అశోక్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు కప్పు అందజేస్తున్న గ్రామస్తులు

మద్దూరు: ఉగాది పండగను పురస్కరించుకొని మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. గ్రామానికి చెందిన 6 టీంలు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. చివరి మ్యాచ్‌లో పవర్ ఇంటర్స్, లక్కీ వారియర్స్ టీంలు తలపడగా విన్నర్‌గా లక్కీ వారియర్స్ టీం నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చిన్న, పెద్ద వీరారెడ్డి, చంద్రప్ప, రఘు, సాయప్ప, కమ్మరి మహిపాల్, మదన్, మోహన్, ఖాజా, భీంరాజ్, సాయి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.